ప్రజాశక్తి
సోమవారం 21 ఆగస్టు 2023

మాట్లాడుతున్న డాక్టర్ భరత్

నీటి వసతి కరువు

- జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా నీటి పథకాలు
- కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా పనులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీల్లో నీటి కోసం వసతులు కరువయ్యాయి. జగనన్న కాలనీల్లో నీటి పథకాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా పనులు చేయడంతో ప్రారంభానికి ముందే నీటి పథకాలు మూలకు చేరాయి...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్లు - జగనన్న కాలనీల్లో వసతులు కరువయ్యాయి. వసతుల కల్పనకు నిధుల కొరత వెంటాడుతున్న ఫలితంగా కాలనీల్లో మంచినీటి వసతి కల్పించేందుకు చేపట్టిన నీటి పథకాలకు సంబంధించిన పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు నిధులు రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. మరికొన్ని కాలనీల్లో నాసిరకంగా చేపట్టిన పనుల కారణంగా వినియోగంలోకి రాకుండానే దెబ్బతింటున్నాయి. కర్నూలు జిల్లాలోని 81, నంద్యాల జిల్లాలోని 263 జగనన్న లేఅవుట్లలో ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధ్వర్యంలో 473 పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.121.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఒక్కో పనికి కనిష్టంగా రూ.5లక్షల నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు కేటాయించారు. ఈ మొత్తంలో ఇప్పటి వరకు రూ.41.52 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. రూ.30.18 కోట్లకు సంబంధించిన నిధులు ప్రతిపాదన దశలోనే ఆగిపోయాయి. ఇదే సమయంలో స్థలం, రహదారి సమస్యలతో కొన్ని చోట్ల మంచినీటి పథకాలు నిలుపుదల చేశారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పనులు చేశామని, రెండేళ్లు గడిచినా బిల్లులు ఇవ్వకపోతే ఎలాగని ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కొన్ని లేఅవుట్లలో నిబంధనలకు విరుద్ధంగా మంచి నీటి పథకాల నిర్మాణం జరిగినట్లు ఆరోపణలున్నాయి. 30 శాతం ఇళ్లు నిర్మించిన తరువాతే నీటి పథకాల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. పలు కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు మొదలు కాకుండానే నీటి పథకాల పనులు చేపట్టడం, నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి. పత్తికొండ నియోజకవర్గం మద్దికెరలో రూ.17 లక్షలతో, పెరవలిలో రూ.17 లక్షలతో, అగ్రహారంలో రూ.8లక్షల వ్యయంతో పనులు పూర్తిచేసినా గుత్తేదారులు బిల్లులు కోసం ఎదురు చూస్తున్నారు. తుగ్గలి, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో పనులు పూర్తయి రెండేళ్లు గడిచినా నిధులు రాలేదు. ఒకవైపు బిల్లులు రాకపోగా మరో వైపు కుళాయిలు విరిగిపోయాయి. నందికొట్కూరు పట్టణంలో నిర్మించిన ట్యాంకు లీకవుతోంది. నంద్యాల మండలం చాపిరేవులలో ట్యాంకును నాసిరకంగా నిర్మించారు. డోన్, పాణ్యం, నంద్యాల చేపట్టిన పనుల్లో నాణ్యతా లోపంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఫిర్యాదులు అందాయి. ఇలా జగనన్న కాలనీల్లో చేపట్టిన నీటి పథకాలు ప్రారంభం కాకుండానే మూలకు చేరుకోవడంతో ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచుదాం

- మూఢవిశ్వాసాలను పారదోలుదాం
- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రాహుల్, డాక్టర్ భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రజల్లో నెలకొన్న మూఢవిశ్వాసాలను పారదోలి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచుదామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ అన్నారు. ఆదివారం జనవిజ్ఞాన వేదిక కర్నూలు జిల్లా 17వ జిల్లా మహాసభలు కర్నూలు సూర్యనారాయణ భవన్ ప్రాంగణంలో డాక్టర్ కె. బడే సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. మహాసభలకు రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షులు రాజశేఖర్‌రాహుల్ ముఖ్య అతిథిగా డాక్టర్‌భరత్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా జిల్లాలో అనేక కార్యక్రమాలను చేపడుతూ జెవివి విద్యార్థులు, మేధావుల మన్ననలు పొందుతుందని అన్నారు. ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్ నినాదాలుగా చేసుకొని ఉద్యమిస్తున్న సంస్థ జనవిజ్ఞాన వేదిక అని అన్నారు. ప్రజలలో నెలకొన్న మూఢవిశ్వాసాలను పారద్రోలడానికి నిరంతరం శ్రమిస్తుందని అన్నారు. జాతకాలు, రంగురాళ్లు, దారాలు, తాయత్తు, చేతబడి లాంటి వందలాది అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా నిరంతరం ప్రజలను చైతన్యవంతం చేస్తున్నది అన్నారు. మహిళలు వికలాంగుల కొరకు ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేసింది అన్నారు. సేవ్ ది గర్ల్ చైల్డ్ ఆడ పిల్లలను పుట్టనివ్వండి ఎదగనివ్వండి చదవనివ్వండి ఇలాంటి నినాదాలతో జిల్లా వ్యాప్తంగా అనేక విద్యా సంస్థలలో ప్రచార కార్యక్రమాలను చేసిందని అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను నిర్వహించి స్త్రీ విద్యా ప్రాముఖ్యతను వివరించామని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు సలహాలు సూచనలను ఇస్తూ ప్రజా మన్ననలను పొందిందన్నారు. "రోనా ,డెంగీ, మలేరియా లాంటి జబ్బులపై ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా వారికి సహాయ సహకారాలు అందించి విద్యార్థులు కూల్‌డ్రింక్స్ తాగడం ద్వారా వచ్చే నష్టాలను ఆరోగ్య సమస్యలను వివరించి చెప్పామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది విద్యాసంస్థల లో కూల్ డ్రింక్స్ మానండి అని పెద్ద ఎత్తున ప్రచారం చేసి ప్రజలలో సామాజిక బాధ్యతలను సామాజిక స్పృహను పెంచడం కోసం గురజాడ , శ్రీశ్రీ జాషువా లాంటి గొప్ప సాహితీ వేత్తల జన్మదినం వారి రచనలను ప్రజలలో ప్రచారం చేసిందని అన్నారు. దేశభక్తి గీతం గురజాడ పద్యం దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అనే గీతాన్ని ప్రచారం చేసిందని అన్నారు.జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి డాక్టర్ కె. బడేసాహెబ్ కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టారు. తదనంతరం జిల్లా సైన్సు ప్రచార ఉద్యమంలో వివిధ మండల కేంద్రాలలో, జిల్లా కేంద్రంగా రూపొందించిన కార్యక్రమాలపై తీర్మానాలు ప్రవేశపెట్టారు. అనంతరం కర్నూలు జిల్లా నూతన జన విజ్ఞాన వేదిక కమిటీని ఎన్నుకున్నారు. ఎస్నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ ప్రకటించారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా బిడి.సుధీర్ రాజు, ఖాజా హుస్సేన్, ఉపాధ్యక్షులుగా డాక్టర్‌సాహెబ్, జిల్లెడ శంకరయ్య, రఫీక్, సహాయ కార్యదర్శులుగా చంద్రశేఖర్ ఆజాద్, వెంకటేశ్వర్లు, తిమ్మప్ప కమిటీ సభ్యులుగా డాక్టర్ జి.ఎల్లకృష్ణ, అర్థశాస్త్ర అధ్యాపకులు, సాయి ఉదయ్, జిల్లా విద్యా వైద్య, సోషల్ మీడియా వంటి కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లాయర్ తిరుపతయ్య, నంద్యాల జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి మాణిక్యం శెట్టి, వెంకట రెడ్డి హెడ్మాస్టర్, సమత కన్వీనర్ రమాదేవి, జన విజ్ఞాన వేదిక నాయకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే రోగాల నియంత్రణ

- విష జ్వరాలపై అవగాహన పెంచుకోవాలి - ప్రజాశక్తితో జిల్లా మలేరియా నివారణ అధికారి నూకరాజు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

"వర్షాకాలం ప్రారంభం నుంచి పలు రకాల దోమలు వద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి దోమల వద్ధి వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఒక్కో రకం దోమ కాటు వల్ల ఒక్కొక్క విష జ్వరం ప్రజలకు సోకుతుంది. దోమలను నివారిస్తేనే జ్వరాలు తగ్గిపోతాయి. లేకపోతే దోమ కాటు వల్ల ప్రాణాలు పోయే పరిస్థితులు ఉన్నాయి." అని జిల్లా మలేరియా నివారణ అధికారి ఎ.నూకరాజు తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

మలేరియా జ్వరం ఎలా వస్తుంది? లక్షణాలు, నివారణ గురించి వివరించండి?

అధికారి : మలేరియా జ్వరం ఆడ ఎనా ఫిలి స్ దోమ కాటు వల్ల వస్తుంది. చలి పణుకుతో కూడిన తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వెళు ్ళనొప్పులు, వికారం వాంతులు లక్షణాలుగా చెప్పవచ్చు. దోమ కాటు తరువాత సాధారణంగా 10- 15 రోజులు తరు వాత వ్యాధి లక్షణాలు కన్పిస్తాయి. ఈ వ్యాధి చిన్న పిల్లలకు గర్భిణీ స్త్రీలకు ప్రమాదకరమైనది. దోమ కాటు లేనిదే మలేరియా రాదు ఆడ ఎనాఫిలిస్ దోమ ల కాటు ద్వారా వ్యాప్తి చెందే ఈ వ్యాధి కాలంలో దోమలు ఎక్కువగుట వలన ఎక్కువగా ఈ వ్యాధి ప్రబలుతుంది. మలేరియాకు క్లోరోక్విన్ మరియు ప్రైమాక్విన్ మాత్రలతో చికిత్స ఉంటుంది. పరిసరాల యందు నీటి నిల్వలను లేకుండా చూసుకోవాలి. ఇండ్లపై దోమల మందు చల్లించుకోవాలి. కట్టడాలకు సంబంధించిన ప్రదేశాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలి. ఆరు బయట నిద్రించరాదు. దోమల బా రిన పడకుండా దోమతెరలు వాడడం మరియు ఇంటి కిటికీలకు, తలుపులకు, జాలీలు బిగించుకోవాలి.

డెంగ్యూ జ్వరం ఎలా వ్యాప్తి చెందుతుంది? జ్వరం సోకిన వారు కోలుకుంటారా?

అధికారి : డెంగ్యూ వ్యాధి ఆడ దోమకాటు వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి హఠాత్తుగా వచ్చు తీవ్రమైన జ్వరంతో మొదలవుతుంది. కళ్లు కదిలిం చలేని పరిస్థితి. ఎముకల్లోనూ, కండరాల్లో భరిం చలేని నొప్పి శరీరం పై పొక్కులు (రాష్) వస్తుంది. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మల విసర్జన ఈ వ్యాధి ప్రమాద లక్షణాలు. ఒకసారి వచ్చిన 7 నుండి 10 రోజులకు మళ్లీ తిరగబడుతుంది. వైరస్ వలన కలిగే ఈ వ్యాధి ఏడిస్ రకం దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు ఇండ్లలోని నీటి నిల్వల్లో మాత్రమే పెరగుతాయి. ఈ దోమలు పగలు కుడతాయి. ఈ వ్యాధికి పూర్తి చికిత్స లేదు. లక్షణాలు బట్టి వైద్యునిచే ఉపశమన చర్యలు చేపట్టాలి. వ్యాధి తీవ్రంగా ఉన్నట్లయితే ప్రభుత్వ సర్వజన/ జిల్లా ఆసుపత్రులలో సంప్రదించాలి. పూర్తిగా కోలుకునే వరకు వైద్యుని పర్యవేక్షణలో ఉండాలి. అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకంగా మారవచ్చు.

డెంగ్యూ నివారణ చర్యలు ఏమిటి ?

అధికారి : తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాతటైర్స్ ఖాళీ డబ్బాలు, పనికారాని విరిగిపోయిన ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాలలో ఉంచకుండా చూడాలి. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలి. నీటి తొట్టెలను వారా నికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టి మరల నింపుకోవాలి. ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లు, ఫ్లవర్ వాజ్‌లు, స్థూల మరియు మొక్కల కుండీలులోని నీటిని తరచు మార్చవలెను. వాటర్ ట్యాంకులు ఇంటిలో నీటి నిల్వల మీద దోమలు జొరబడని మూతలు వేసి ఉంచాలి. దోమతెరలు వాడడం లేదా ఇంటి కిటికీలకు, తలుపులకు, జాలీలు బిగించుకోవాలి. వస్త్రధారణ, పొడుగ్గా మరియు సదులుగా ఉండే వస్త్రాలు దోను కాటు నుండి రక్షిస్తాయి.

చికెన్ గున్యా వ్యాధి ఎలా వస్తుంది?

అధికారి : ఆడ ఏడీస్ దోమ కాటు వల్ల వస్తుంది. వ్యాధి లక్షణాలు ఆకస్మాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, కొద్ది రోజులు ఉండి మళ్ళీ తిరగబెడుతుంది. వ్యాధి తిరగబెట్టినపుడు తీవ్రమైన జ్వరంతో పాటు కీళ్ళ నొప్పులు కూడా ఉంటాయి. ఈ కీళ్ళ నొప్పులు ప్రత్యేకించి చిన్న చిన్న కీళ్ళ దగ్గర ఎక్కువ బాధిస్తాయి. కొందరిలో అయిదు రోజుల పాటు మరి కొందరికి పది రోజుల పాటు, ఇంకా కొందరికి రెండు నుంచి మూడు వారాలపాటు బాధిస్తాయి. ప్రాణభయం లేనప్పటికీ వ్యాధి వలన వచ్చిన నీరసం, నొప్పుల నుంచి కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది. మనిషి రక్తానికి అలవాటు పడ్డ ఈ దోమలు పగటి పూట కుడతాయి.

సీజనల్ వ్యాధుల కేసుల ఎలా నమోదవుతున్నాయి?

అధికారి : ఏడాదిలో మలేరియా కేసులు 2016లో 250, 2017 లో 16, 2018 లో 19, 2019లో 7, 2020లో 14, 2021లో 18, 2022లో 6, 2023 లో 4 కేసులు నమోదు అయ్యాయి. డెంగ్యూ కేసులు 2016లో 33, 2017 లో 267, 2018లో 5, 2019లో 63, 2020లో 10, 2021లో 170, 2022లో 342, 2023లో ఇప్పటివరకు 254 కేసులు నమోదయ్యాయి. చికెన్ గునియా కేసులు 2016లో 8, 2017లో 3, 2018లో 0, 2019లో 3, 2020లో 0, 2021లో 2, 2022లో సున్నా 2023లో ఇప్పటివరకు సున్నా కేసులు నమోదయ్యాయి.

ఉప'పోరు'లో వైసిపి హవా

- ఉమ్మడి జిల్లాలో రెండు సర్పంచులు, 34 వార్డు స్థానాలకు ఎన్నికలు
- 2 సర్పంచులు, 24 వార్డు సభ్యులు వైసిపి మద్దతు దారుల వశం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన గ్రామ పంచాయతి ఉప ఎన్నికల్లో వైసిపి విజయకేతనం ఎగురవేసింది. వివిధ కారణాలతో ఖాళీగా ఏర్పడిన స్థానాలకు నిర్వహించిన ఎన్నికలు ప్రధాన ఎన్నికలను తలపించాయి. కర్నూలు జిల్లాలో ఒక సర్పంచి, 42 వార్డు స్థానాలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో 27 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా ఒక సర్పంచ్, 15 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. కర్నూలు జిల్లాలో ఒక సర్పంచి, 42 వార్డు స్థానాలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో 27 వార్డు స్థానాలు ఏకగ్రీవం కావడంతో శనివారం 15 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అందులో ఒక సర్పంచి, 9 వార్డు స్థానాల్లో వైసిపి బలపరచిన అభ్యర్థులు విజయం సాధించగా 6 స్థానాల్లో టిడిపి బలపరచిన అభ్యర్థులు విజయం సాధించారు. ప్రధానంగా కౌతాళం మండలం బదినేహాలు గ్రామంలో వైసిపి, టిడిపి మధ్య గట్టిపోటీ నెలకొంది. ఇరు పార్టీలు పోటీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ పోటీలో వైసిపి అభ్యర్థి టిడిపి అభ్యర్థిపై 323 ఓట్లతో గెలుపొందారు.

నంద్యాల జిల్లాలో 3 సర్పంచులు, 291 వార్డు స్థానాలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. అందులో అవుకు మండలం అన్నవరం, కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామ సర్పంచ్ స్థానాలతో పాటు ఆయా మండలాల్లోని 272 వార్డుల సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో ఒక సర్పంచి, 19 వార్డు సభ్యుల స్థానాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో ఒక సర్పంచి, 15 వార్డు స్థానాలు వైసిపి బలపరచిన అభ్యర్థులు కైవసం చేసుకోగా టిడిపి బలపరచిన అభ్యర్థులు 3, రెబల్ అభ్యర్థి 1 స్థానం కైవసం చేసున్నారు. ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామ పంచాయతి సర్పంచ్ స్థానానికి వైసిపి నుంచి నల్లజన లక్ష్మిదేవి, టిడిపి తరపున ఆర్ల నాగ శ్రీనివాసులు పోటీ పడ్డారు. వైసిపి అభ్యర్థి ప్రత్యర్థులపై 402 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న బిటి నాయుడు

రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే : టిడిపి

ప్రజాశక్తి-సి బెళగల్

రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యాలేనని టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు అన్నారు. ఆదివారం యనగండ్లకు వచ్చిన ఆయన శనివారం అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న టిడిపి కార్యకర్త శ్రీకృష్ణ దేవరాయలు కుటుంబాన్ని పరామర్శించారు. భార్య రంగమ్మ కూతురు, కుమారుడులను ఓదార్చి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో రైతులు పంటలు వేస్తె దిగుబడి ఉంటే గిట్టుబడి ఉండదు, గిట్టుబడి ఉంటే మద్దతు ధరలు మాటే లేదన్నారు.రాష్ట్రంలో రైతులు అప్పుల ఊబిలో కూరుకుని ఆత్మహత్యలు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు. ప్రజలు ఒకసారి వైసిపికి ఓటు వేసి తప్పుచేసారని మరోసారి ఆ తప్పు చేయకండన్నారు. రాష్ట్రంలో రామరాజ్యం పాలన టిడిపితోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కోడుమూరు ఇన్‌చార్జి ప్రభాకర్, మండల కన్వీనర్ గోవింద్ గౌడ్, గంపరాజు వెంకటేష్, గిడ్డయ్య గౌడ్, పోలకల్ సోమన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

సమస్యలను తెలుసుకునేందుకే వచ్చా : హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సమస్యలు తెలుసుకునేందుకే మీ వద్దకు వచ్చానని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. నగరంలోని 45వ వార్డ్ 117వ సచివాలయం పరిధిలోని అశోక్ నగర్ వీధుల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. ఆర్థికాభివృద్ధితోనే పేదల బతుకులు మారుతాయని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి ప్రతి ఇంటికి మేలు చేసేలా పథకాలు తీసుకొచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. 45వ వార్డ్ వైసిపి నాయకులు, ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ మెంబర్ ప్రభుదాస్, జిల్లా యూత్ ప్రెసిడెంట్ సితార ఇర్ఫాన్, జమ్మన్న, భాస్కర్ రెడ్డి, షైక్, సాదిక్, జోషి రాజ్, చందు, ఖాదర్‌బాషా, రామకృష్ణ, శాఖర్వాలి, ఖుద్దుస్, ప్రేమ, అబ్దుల్లా, అంజి, భరత్, నందు, మహేష్, ఇమ్రాన్ ,ఇమామ్, బాషా, పార్టీ ముఖ్యనాయకులు, వార్డు కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయివేటు పరం చేయడానికే పాఠశాలల అనుసంధానం

ప్రజాశక్తి- కర్నూల్ కార్పొరేషన్

ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేటుపరం చేయాలనే ఉద్దేశంతో మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉన్నత పాఠశాలలకు అనుసంధానం చేయడం ద్వారా నివాసాలకు పాఠశాలలు దూరంగా ఉండటం వలన బడి మానివేసే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, విద్యార్థులు లేరని నెపంతో ఉపాధ్యాయులను బదిలీ చేయడం సిగ్గుచేటని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం అధ్యక్షుడు కె.ఎల్లప్ప అధ్యక్షతన నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వం సురేష్ కుమార్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన పాఠ్యాంశాలను తొలగించడం, చరిత్రను వక్రీక రించడం వంటి అభివృద్ధినిరోధక చర్యలకు పాల్పడు తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు ఎంఇఒ 1,2ల కు అధికారులు కేటాయించలేదని అన్నారు. దీనివలన వేల మందికి రాష్ట్ర వ్యాప్తంగా జీతాలు అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే జీతాలు చెల్లించాలని చెప్పారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.ఎల్లప్ప, ఎస్‌ఎం. జయరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తుందని అన్నారు. జిఒ ఎంఎస్ నెంబర్ 117ను రద్దు చేయాలని చెప్పారు. పని సర్దుబాటు ప్రక్రియను చేయాలని బదిలీలు, ప్రమోషన్లపై వెళ్లిన వారికి మూడు నెలల నుండి జీతాలు ఇవ్వడం లేదని పై సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హేమంత్ కుమార్ ,రవికుమార్, ఇబ్రహీం ,నవీన్ ,దావీద్, దేవపాలు, జీవిత, రాఘవేంద్ర అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్

ఆరుగురు ఎన్నిలక సూపర్‌వైసింగ్ ఆఫీసర్ల సస్పెన్షన్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఎలక్షన్స్ సూపర్‌వైసింగ్ ఆఫీసర్లు ఆరుగురిని సస్పెండ్ చేస్తూ కర్నూలు అసెంబ్లీ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ , కమిషనర్ ఎ. భార్గవ్ తేజ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో ఎం.నాగార్జున వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ, ఎన్. నాగరాజు వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ, ఎస్‌ఎండి. హుస్సేన్, వార్డు రెవెన్యూ సెక్రెటరీ, ఎం.కిరణ్మయి, వార్డు ప్లానింగ్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యదర్శి, ఎం. రాజు వార్డ్ వెల్ఫేర్ అంటే డెవలప్మెంట్ సెక్రటరీ, కె.నరేష్, వార్డ్ ప్లానింగ్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యదర్శులు ఉన్నారు. వారు తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఇంటింటి సర్వే చేయడంలో, వారి పని విధానం సరిగా లేనందువల్ల సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తరంలో పేర్కొన్నారు.

30న నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈనెల 30న ఎస్‌బిఐ కాలనీ కొత్త కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బివై.రామయ్య ఆదివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. అన్ని విభాగాల అధిపతులు అజెండాలపై చర్చించేందుకు సన్నద్ధం కావాలని చెప్పారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు హాజరు కావాలని కోరారు.

రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పిస్తున్న సుధాకర్‌బాబు, తదితరులు

రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

సాంకేతిక విప్లవ సారథి రాజీవ్ గాంధీ అని డిసిసి అధ్యక్షుడు ఎం.సుధాకర్ బాబు కొనియాడారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకల ర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి సుధాకర్ బాబు ఇతర కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.రాజీవ్ గాంధీ చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కె. సత్యనారాయణ గుప్త ,బి.బతుకన్న, దామోదరం రాధాకృష్ణ, కె బాబురావు, షేక్ ఖాజా హుస్సేన్,ఎస్ ప్రమీల, ఎస్సీ సెల్ సిటీ అధ్యక్షులు డబ్ల్యు సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డిఐఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్

దోమల నివారణ తప్పనిసరి

డిఐఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భముగా రీజనల్ ఫిమేల్ ట్రైనింగ్ సెంటర్‌లో దోమల నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజ , జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి సర్ రోనాల్డ్ రాస్ చిత్ర పటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దోమలవలన మలేరియా వ్యాధి ఒకరి నుండి మరొకరికి వస్తుందని సర్ రోనాల్డ్ రాస్ ఆగస్ట్ 20న 1897లో కనుగొన్నారని తెలిపారు. అందులకు వారికి 1902లో నోబుల్ ప్రైజ్ బహుకరించారని కొనియాడారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు మాట్లాడుతూ దోమలు పుట్ట కూడదు - దోమలు కుట్టు కూడదు అను నినాదాన్ని అమలు చేయడానికి ఫ్రైడే - డ్రై డే ప్రతి శుక్రవారం నిర్వహించాలన్నారు. గృహ పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా ఉంచుకొనేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎఎంఒ చంద్రశేఖర్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మొబైల్ ఆధార్ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఈ నెల 22 నుంచి 25 వరకు కర్నూలు జిల్లా పరిధిలో అన్నిమండలాలు, మునిసిపాలిటీలలోని సచివాలయల పరిధిలో మొబైల్ ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిడిఒలు, మునిసిపల్ కమిషనర్లు తప్పనిసరిగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి పంపించాలన్నారు. జిల్లాలో 96 ఆధార్ కేంద్రాలు ఉన్నాయని, ఈ ఆధార్ కేంద్రాలు మండల , మునిసిపాలిటి పరిధిలో అన్ని సచివాలయాలలో నమోదు చేసుకోవచ్చన్నారు. కొత్తగా ఆధార్ నమోదు చేయుట, ఆధార్ నమోదు పూర్తయి ఆధార్ కార్డు లేనివారు, 0 నుండి 5.సం, 5 సం. లు నుండి 16 సంవత్సరాల లోపు బాల బాలికలు, ఇంటి చిరునామా, మొబైలు నెంబర్ ఫోటో మార్చుకోదల్చిన వారు, అదే విధంగా వేలి ముద్రలు వంటి బయోమెట్రిక్ అప్డేట్ చేయించుకోదల్చిన వారు ఈ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదే విధంగా 2010 నుండి 2016 సంవత్సరాల ల మధ్య ఆధార్ నమోదు చేసుకొని తర్వాత ఒక్కసారి కూడా అప్‌డేట్ చేయించు కోనివారు విధిగా ఆధార్ కేం ద్రాలను సందర్శించాలన్నారు. ఆధార్ డాక్యుమెంట్స్ అప్‌డేట్ చేసుకోవాలని కోరారు.

కిడ్నాపర్లు అరెస్ట్

- తెలంగాణ రాష్ట్రం నుండి బాలుడిని తరలిస్తుండగా అదుపులోకి..

ప్రజాశక్తి - ఆలూరు

పట్టుబడిన కిడ్నపర్‌లు

తెలంగాణ రాష్ట్రంలోని వికారబాద్ జిల్లా కోతగది గ్రామానికి చెందిన నిరంజన్ అనే యువకుడికి రంగారెడ్డి జిల్లా కడ్తల్ వద్ద తమ నర్సరీ నుంచి నిరంజన్ అనే 16 ఏళ్ల యువకుడిని ఆదివారం ఉదయం నలుగురు బలవంతంగా కారులో కిడ్నాప్ చేశారు. ఆ యువకుడి వద్ద ఉన్న సెల్ నుంచి తల్లి లక్ష్మికి కిడ్నాపర్లు ఫోన్ చేసి 'నీ కొడుకును కిడ్నాప్ చేశాము రూ.2కోట్లు ఇస్తే వదిలిపెడతాం' అని బెదిరించారు. వెంటనే ఆమె పోలీసులకు తెలుపగా బళ్ళారి వైపు వెళ్లుతున్నట్లు లొకేషన్ ద్వారా పోలీసులు కనుగొని కర్నూల్ జిల్లా ఆలూరు పోలీస్‌లకు సమాచారం అందించారు. కిడ్నాప్ సమాచారం తెలియగానే జిల్లా పోలీస్ అధికార్ల ఆదేశాల మేరకు అప్రమత్తమైన ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ డా. నాయక్, సిబ్బంది నవీన్ గిరి, జానివాకర్ వాహనాలను తనిఖీ చేయగా ఆలూరు అంబేద్కర్ కూడలిలో వాహనంను గుర్తించి కిడ్నాపర్లను అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాపర్లు బసవరాజు, బుజంగం, చిలుకూరి కుమార్,సాయి కర్ణాటక రాష్ట్రం బళ్ళారి జిల్లా ఖణేకల్‌కు చెందిన వారిగి గుర్తించామని, తెలంగాణ పోలీసులకు అప్పగిస్తామని ఎస్ఐ డా.నాయక్ తెలిపారు.

గ్రానైట్ హమాలీలకు కూలిరేట్లు పెంచాలి

ప్రజాశక్తి - ఆదోని

నోటీసును యజమానికి ఇస్తున్న దృశ్యం

గ్రానైట్, టైల్స్ బండల డిపోల్లో పని చేస్తున్న హమాలీలకు కూలి రేట్లు పెంచాలని యూనియన్ గౌరవాధ్యక్షులు పిఎస్ గోపాల్, అధ్యక్షులు తిప్పన్న, సహకారదర్శి లక్ష్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని గ్రానైట్స్ బండల యజమానులకు 50 శాతం పెంచాలని డిమాండ్ నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ పెరిగిన ధరలతో ఇప్పుడిస్తున్న కూలిలు కుటుంబాల పోషణ భారంగా మారిందన్నారు. డిపోల యాజమాన్యం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాదాలు జరిగితే యాజమాన్యం ఆదుకోవాలని, ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఏడు రోజుల్లోగా రేట్లు పెంచి సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హమాలి నాయకులు చిన్న, నాగరాజు, పెద్ద నాగరాజు, తాయప్ప, ఈరన్న పాల్గొన్నారు.

బెట్ట పరిస్థితుల్లో సస్యరక్షణ చేపట్టాలి : ఏడిఎ

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఆముదం పంటను పరిశీలిస్తున్న అధికారులు

బెట్ట పరిస్థితుల్లో పంటలకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఎమ్మిగనూరు సహాయ సంచాలకులు ఎస్ మహమ్మద్ ఖాద్రి రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలను వ్యవసాయ శాఖ ఎమ్మిగనూరు సహాయ సంచాలకులు ఎస్ మహమ్మద్ ఖాద్రి, గోనెగండ్ల మండల వ్యవసాయ అధికారిని జి హేమలత పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో మిరప, పత్తి, ఆముదం పంటలు ఎండవేడిమికి వడలిపోతున్నాయని, వివిధ రకాల కొత్త కొత్త తెగుళ్ల పురుగులు ఆశిస్తున్నాయని అన్నారు. రైతు సోదరులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలను పాటించి సస్య రక్షణ చేపట్టి సాగు చేసిన పంటలను రక్షించుకోవచ్చు అన్నారు. అనంతరం పలు రకాల మందులను ఏవిధంగా ఉపయోగించాలో రైతులకు వారు వివరించారు.

దేవరగట్టులో శ్రావణ మాస పూజలు

ప్రజాశక్తి- హోళగుంద

మండలంలోని దేవరగట్టులో ఆదివారం నాడు భక్తులు భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు నిర్వహించారు. జిల్లా నుండే కాకుండా కర్ణాటక నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ మాల మల్లేశ్వర లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆరు గంటల నుండే దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అర్చకులు మల్లయ్య, మహేష్, స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఖరీఫ్‌పై నీలినీడలు

-ప్రశ్నార్థకంగా పంటలసాగు
- ఊరిస్తున్న మేఘాలు..
- వర్షాలు లేక ఎండుతున్న పంటలు
- 2 సార్లు విత్తు విత్తిన తప్పని నిరాశ
- వలసబాట తప్పదని రైతన్నలు ఆవేదన

ప్రజాశక్తి- హోళగుంద

పత్తి పంటను గొర్రెలకు వదిలిన చిన్న హేట గ్రామము రైతు ఎర్రప్ప

ఈ ఏడాది సంపూర్ణ వర్షాలు కురువక ఖరీఫ్ సీజన్ ప్రశ్నార్థకంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో ఆలస్యంగా వర్షాలు వచ్చినా ఆశాజనకంగా పంటల సాగు లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత జూలై నెలలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురువడంతో రైతన్న కళ్లలో ఆనందం వెల్లువిరిసింది. అయితే ఆ ఆనందం పట్టుమని 30 రోజులు కాకముందే రైతన్నకు కన్నీరుగా మారింది. ఆగస్టు నెలలో అక్కడక్కడ చదుముదురు చినుకులు వస్తున్న పంటకు కావాల్సి వర్షం కురవడం లేదు. పైరులు సంపూర్ణంగా తడవడం లేదు.

మేఘాలు ఊరిస్తూ.. ప్రతిరోజు మేఘాలు ఊరిస్తూ కనబడడంతో మంచి వర్షం కురుస్తుందని రైతన్నకు కుదటపడగానే మేఘాలు మాయమై వర్షం కురవడం లేదు. దీంతో రైతన్న మళ్లీ దిగెళ్ళు పడక తప్పడం లేదు. ఆదిగో వర్షం ఇదిగో వర్షం అని ఆశలు తప్ప వర్షాలు రావడం లేదని రైతన్న ఆవేదన చెందుతున్నాడు.

హోళగుంద మండలంలో 17 గ్రామపంచాయతీలు ఉండగా మజార గ్రామాలు కలిపి 23 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ కోసం 15,333 హెక్టర్ల సాగుభూమి సిద్ధంగా ఉండగా ఇప్పటివరకు కేవలం బోరు బావుల దగ్గర, అక్కడక్కడ వర్షాధార భూములు అరకొర వర్షాలకు 9670 యాక్టర్లలో మాత్రమే ఇప్పటివరకు సాగు జరిగింది. అయితే ఆ పంటలు సైతం వర్షాలు లేక ఎండిపోతున్నాయి.

ఈ ఏడాది వలసలు తప్పవా? : ఈ ఏడాది వలసలు తప్పవా? అంటే అవుననే చెబుతున్నారు అన్నదాతలు. మే, జూన్ జూలై ముగిసి, ఆగస్టు నెల చివరికి చేరుకున్న ఇంతవరకు సంపూర్ణమైన వర్షాలు పడకపోవడంతో కుటుంబ పోషణ భారం అయ్యింది. మరోవైపు ఇప్పటి వరకు పంటలకు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల ద్వారా తెచ్చుకున్న రుణం యమపాశంగా మారింది. కౌలు రైతుల దుస్థితి మరింత దిగజారింది. దీంతో చేసేదేమి లేక వలసలు వెళ్ళక తప్పదని రైతన్నలు ఆవేదనతో చెబుతున్నారు. పదును అయ్యేంత వర్షం కురవకపోవడంతో రెండు మూడు సార్లు తమ తమ పొలాల్లో విత్తనాలు పెట్టి పూర్తిగా నష్టపోయామని రైతులు పేర్కొంటున్నారు.

పనులు లేక వ్యవసాయ కూలీలు పస్తులు : మండలంలో మంచి వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయ కూలీల సైతం పనులు లేక అల్లాడుతున్నారు. గత సంవత్సరం జూన్ జూలై నెలలో మంచి వర్షాలు కురవ డంతో వ్యవసాయ కూలీలకు మంచి డిమాండ్ ఉండేదని రూ.250 నుంచి రూ.300 పైగా ఇచ్చేవారు. ఈ ఏడాది 200 రూపాయలు ఇచ్చేవారు కూడా కరువయ్యారని వ్యవసా య కూలీలు పేర్కొంటున్నారు. గత 20 రోజుల క్రితం తుఫాన్ ప్రభావంతో కురిసిన అడపదడప వర్షాలకు వారం రోజులు వ్యవసాయ కూలి పనులు దొరికా యని వాపో యారు. ఉపాధి హామీ పనులకు వెళితే సకాలం లో కూలీలు అందక కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షపాతం తక్కువ నమోదయింది

- ఆనంద్ లోక్ దాల్, మండల వ్యవసాయ అధికారి

ఈ ఏడాది ఖరీఫ్‌లో లోటు వర్షపాతం నమోద యింది. రైతులు విత్తనాలు వేశారు కానీ.. వర్షం లేక పంటలు ఎండిపోతు న్నాయి. ప్రభుత్వం అనుమతిస్తే జిల్లా అధికారుల ఆదేశాల మేరకు లోటు వర్షపాతం, పంటల వివరాలు వంటి నివేదికను పంపుతాం.

కరువు మండలంగా ప్రకటించాలి

- వెంకటేష్, రైతు సంఘం జిల్లా నాయకులు

హోళగుంద మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి. ఏడాది సంపూర్ణ వర్షాలు కురువక పంటలన్నీ ఎండిపోయా యి. రైతులు ఒకటికి రెండుసార్లు విత్తనాలు పెట్టి పూర్తిగా నష్టపోవడం జరిగింది. ప్రభుత్వ నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. ప్రస్తుతం ఉన్న పంటలన్నిటికీ క్రాప్ ఇన్సూరెన్స్ అందించాలి. వలసలు వెళ్లే అవకాశాలు ఉన్నందువల్ల ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించే ఆదుకోవాలి.

ఆదోని ఎమ్మెల్యే సీటు ముస్లింలకు ఇస్తారా..

- ఎంహెచ్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శుబ్లీ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో అత్యధిక జనాభా ఉన్న ముస్లిం మైనారిటీలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, వారికోసం ప్రాణా లైనా ఇస్తామని చెప్పుకునే ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడులు వచ్చే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వారికి మీ సీట్లు త్యాగం చేస్తారా అని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫరుఖ్ శుబ్లీ సవాల్ చేశారు. ఆదివారం పట్టణంలోని కేకేబి ఫంక్షన్ హాల్‌లో ఎంహెచ్పీఎస్ నాయకులు గడ్డ ఫక్రుద్దీన్, హుస్సేన్‌ల ఆధ్వర్యంలో రాజకీయ చైతన్య సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు ఫరుక్ శుబ్లీ మాట్లాడుతూ ఈసారి ఆదోని నియోజకవర్గం నుండి ముస్లిం మైనారిటీలకు వైకాపా, టిడిపిల నుంచి పోటీ చేసేందుకు సీట్లను త్యాగం చేయాలని కోరారు. దేశంలోను, రాష్ట్రంలోను, గ్రామాల్లోను అన్యాయం ముస్లింలకు మాత్రమే జరగడంలేదని అన్ని వర్గాల వారికి అన్యాయం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో పని చేయాలని మానవత్వ గుణం అలవర్చుకోవాలని అన్నారు. మణిపూర్‌లో క్రైస్తవులను సర్వనాశనం చేస్తున్నారని, కేంద్రం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే వైఖరితో ముందుకు సాగుతుందని అన్నారు. ఇటీవల ఆదోని పట్టణంలో ఒక దేవాలయంలో జరిగిన ఘటన తనకు ఎంతో కలిచివేసిందని, ఆదోని టూ టౌన్ సీఐ శ్రీనివాస్ నాయక్ ఆ సంఘటనను ఎంతో చాకచక్యంగా పరిష్కరించారని ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ఆ సంఘటనతో తీవ్ర మనోవేదనకు గురైన హైం దవ సోదరునికి తాను సైతం క్షమాపణ కోరుతున్నానని అన్నారు.

మైనార్టీ బాలిక హత్యపై సిఎం ఎందుకు స్పందించడం లేదు

ముస్లిం మైనారిటీ నాయకులు ఉమ్మి సలీం మాట్లాడుతూ ఇటీవల గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామంలో హాజీరబీ అనే మైనార్టీ బాలిక పై మూడేళ్ల క్రితం అత్యాచారం చేసి హత్య చేశారని, ఇంతవరకు ఆ బాలిక ఆచూకీ లేదని దీనిపై ఇంతవరకు సీఎం జగన్మోహన్ రెడ్డి స్పందించ లేదని అన్నారు. ఇటీవల తాను హాజీరాబీ తల్లిని కలిసి విచారించానని ఇద్దరూ కూతురులతో జీవనం చేస్తున్న హాజరబీ తల్లి చెప్పిన ఉదాంతం చూస్తే తనకు కంటితడి వచ్చిందని అన్నారు. మైనారిటీలకు వైసిపి పభుత్వం అన్నింటా ద్రోహం చేసిందన్నారు. ఈ సదస్సుకు ముస్లిం మైనారిటీ నాయకులు సౌదీ రవూఫ్, ఉమ్మి సలీం, మనియార్ యూనస్, ఎం హెచ్ పి ఎస్ రాష్ట్ర నాయకులు అక్రమ్, అబ్దుల్ గఫార్, జిలాన్ బాష, పాస్టర్ రెవరెండ్ ఆనంద్ రాజు, క్రైస్తవ సంఘం నాయకులుఎస్. దేవదానం, అమల నాథ్, డాక్టర్ కిరణ్, తదితరులు ప్రసంగించారు.

మాట్లాడుతున్న ఎంహెచ్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శుబ్లీ

సిఐగా పదోన్నతి పొందిన దస్తగిరికి సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

అనంతపురం జిల్లాలో సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న ఎమ్మిగనూరు మండలం, కె. తిమ్మాపురం గ్రామానికి చెందిన కురువ దస్తగిరి సర్కిల్ ఇన్ స్పెక్టర్‌గా పదోన్నతి పొందడంతో ఆదివారం తన స్నేహితులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులు, వివిధ సంఘాల నేతలు హాజరై శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి, పూలమాలలు వేసి అభినందనలు తెలియ జేశారు. ఈ సందర్భంగా దస్తగిరి స్నేహితులు టిడిపి నేత కదిరికోట ఆదెన్న, ఎమ్మిగనూరు మండలం టిడిపి అధ్యక్షులు డా.పార్లపల్లి మల్లికార్జున , మున్సిపల్ మాజీ న్యాయ సలహాదారు న్యాయవాది రషీద్లు మాట్లాడుతూ పోలీస్ శాఖలో దస్తగిరి ఉన్నత శిఖరాలను అధిరోహించి విధుల నిర్వహణలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా సేవలందించి పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్, డిగ్రీ బ్యాచ్ మేట్స్ గువ్వలదొడ్డి విజయభాస్కర్ గౌడ్, వెంకటాపురం భోజప్ప, చాంద్, యాపిల్ డయాగ్నస్టిక్ అధినేత కురువ బీరప్ప, దైవందిన్నే వి. ఆర్.ఓ.చిన్న ఈరన్న, తిమ్మలమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం చేస్తున్న స్నేహితులు

గృహ ప్రవేశంలో వై. సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రచ్చుమర్రి గ్రామానికి చెందిన రవి నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశానికి ముఖ్య అతిథులుగా వైసిపి నాయకులు పెద్దాయన ఎమ్మిగనూర్ ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై సీతారామిరెడ్డి ప్రారంభించారు. ఆదివారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో రచ్చుమర్రి గ్రామ నుండి వచ్చిన రవి తుంగభద్ర నది తీరంలో చిరు వ్యాపారం చేస్తూ మంత్రాలయంలో స్థిరపడ్డ ఆయన నూతనంగా నిర్మించిన ఇంటిని నిర్మించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పెద్దాయనకు శాలువతో పూలమా లలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవిని అభినందించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, నాయకులు బసవరాజు (మీసా లస్వామి), వీరభద్ర, శంకర్ స్వామి, వీరేష్ స్వామి తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డయ్య

బస్సు యాత్రను జయప్రదం చేయండి : సిపిఐ

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి ఈనెల 17 నుండి సెప్టెంబర్ 8 వరకు సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే సిపిఐ ప్రచార జాత, బస్సు ను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి గిడ్డయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కే అజయ్ బాబు, సిపిఐ పట్టణ మండల కార్యదర్శి సుదర్శన్, కల్లుబావి రాజు కోరారు. ఆదివారం ఆదోనిలోని సీపీఐ కార్యాలయంలో మండల సహాయ కార్యదర్శి నర్సప్ప అధ్యక్షతన జరిగిన పట్టణ, మండల సమితి జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1, 2 తేదీలలో కర్నూలు, కోడుమూరు, ఆలూరు, పత్తికొండలో బస్సు యాత్ర, భారీ బహిరంగ సభలో సంఘాల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఓబి నాగరాజు, వెంకన్న, వైటి భీమేష్, షేక్షావలి, ఏఐఎస్ఎఫ్ , ఏఐవైఎఫ్ నాయకులు షాబీర్ భాష, గిరి మల్లప్ప, సిపిఐ పట్టణ మండల సహాయ కార్యదర్శి విజయ్ కుమారస్వామి, లక్ష్మీనారాయణ, సిపిఐ మాజీ మండల కార్యదర్శి బసాపురం గోపాల్, సిపిఐ శాఖ కార్యదర్శిలు మెకానిక్ వలి, కరెంటు ఈరన్న, చందు, నాగరాజు, ప్రకాష్, పార్టీ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE OF ADONI
E.P. 9 OF 2021 IN O.S. 51 of 2008

Between:-
K.Jaloji Rao. ...Decree Holder

-Vs-

1. B.Madanna (died by LRS)
2. B.Lakshmi Devi
3. B.Suresh Babu 4. B.Suchitra
5. B.Sunitha alias B.Sashikala.

...Judgment debtors

Notice

To,
Judgment Debtor No.5:
B.Sunitha @D.Shashikala w/o
D.Lakshminarayana, Hindu, aged about
30 years, R/o 1-3123, Yemmiganur

Madam,

Take notice that honorable court has ordered substitute service of summons to above named JDR no.5 you have to appear before the above mentioned court on 23.8.2023 at 10.30 am either personally or through your advocate and file objections if any otherwise the case will be decided exparte.

C.Giridhar
Advocate for DHR

వెండి పల్లకి, బంగారు కళశాలు విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్నస్వామి దేవస్థానంకు మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి, సత్యమని జయమ్మ రూ.29 లక్షల విలువ గల వెండి పల్లకి, బంగారు కలశాలు విరాళంగా అందజేశారు. ఆదివారం పాలకమండలి అధ్యక్షులు నాగరాజు గౌడ్, దేవాలయ సహాయ కమిషనర్ వాణి, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి పండితుల ఆధ్వర్యంలో దేవస్థాన ఆర్చిగేటు దగ్గర నుండి వైభవంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దేవాలయ అధికారులు సాధన పరచుకున్నారు. 27 లక్షల రూపాయలతో పల్లకికి వెండి తొడుగు, లక్షల రూపాయలతో రాగి కళాశాలకు బంగారు పూత వేయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి, పాలక మండలి సభ్యులు, దేవాలయ సూపర్డెంట్లు వెంకటేష్, రామ్మోహన్, దేవాలయ అర్చకులు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నవోదయలో విజ్ఞాన్ జ్యోతి-4

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

జవహర్ నవోదయ విద్యాలయ బనవాసిలో విజ్ఞాన్ జ్యోతి 4వ దశ కార్యక్రమం ప్రారంభమైనది. అందులో భాగంగా రోల్ మోడల్‌తో అనుస ంధానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బనవాసి కృషి విజ్ఞాన్ కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.కె.లక్ష్మణ్ సుస్థిర వ్యవసాయం, నేల, నీరు, వాతావరణం, కాలుష్యం, తదితర అంశాలపై వివరించారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఇంచార్జి కె.చంధిరన్ మాట్లాడుతూ విజ్ఞాన్ జ్యోతి కార్యక్రమం కేవలం 100 నవోదయ విద్యాలయాలకు మాత్రమే ఇవ్వటం జరిగిందని, అందులో మన విద్యాలయం ఉండటం ఆనందంగా ఉందన్నారు. విజ్ఞాన్ జ్యోతి ముఖ్య ఉద్దేశ్యం, గ్రామీణ నేపథ్యంలో అమ్మాయిలు (10వ తరగతి , 12వ తరగతి) సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రావీణ్యం ఇచ్చి, భవిష్యత్తులో నీట్, జేఈఈ లాంటి పరీక్షలలో సీటు సాధించటానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్య క్రమంలో వైస్ - ప్రిన్సిపాల్ ఇంచార్జి ఎ. కె. బసవరాజ్, యం. వెంకటేష్, విజ్ఞాన్ జ్యోతి ప్రాజెక్ట్ కోర్డినేటర్ పద్మజ నాన్సీ, హరీష్ కుమార్,రింకు శర్మ తదితరులు పాల్గొన్నారు.

'నిండు జాబిలి' ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆలూరు

బాలబంధు గద్వాల సోమన్న బాల సాహిత్యంలో మెరుగైన రచయిత అని రచయిత, కవులు హెచ్.రామలింగమ్మ, సవ్వప్ప,ఈరన్న,ప్రతాప్ స్వామి, ఎస్ఐ డాక్టర్ నాయక్ అన్నారు. ఆదివారం ఆలూరు గ్రంథాలయం కార్యాల యంలో గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెద్దకడబూరు మండలం కంబదహాళ్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్న రచించిన 39వ 'నిండు జాబిలి' నూతన పుస్తకాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణితోపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న తెలుగు సా హిత్యంలో అందెవేసిన చేయిల బాల సాహిత్యంలో సోమన్నను విశేష కృషి చేశారన్నారు. ఇంకా మరెన్నో పుస్తకాలు రచించాలన్నారు. అనంతరం గద్వాల సోమన్నను శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమ ంలో కవులు,ఉపాధ్యాయులు కళాకారులు డి.కేశవయ్య,బి.టి.లక్ష్మణ, లైబ్రరీ యన్ విజయభాస్కర్, రామూర్తినాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

కేకు కట్ చేస్తున్న చిప్పిగిరి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం చిప్పగిరి మండల కేంద్రంలోని ఆర్.డి.టి స్కూల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా చిప్పగిరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన మహోన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కరెంటు గోవిందు, చిప్పగిరి వినోద్ కుమార్, బాలరాజు, రమేష్, శివన్న, లక్ష్మన్న, రామచంద్ర, శివ, దివాకర్ చిన్నారులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం

ప్రజాశక్తి - ఆదోని

నీట్ పరీక్షల్లో 534 మార్కుల సాధించిన ఆదోనికి చెందిన విద్యార్థిని షమీనాను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పూలమాల శాలువాతో సన్మానం చేశారు. ఆదివారం వారి ఇంటికి వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడారు. పేద విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహించే దిశగా ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు నాగరాజు, గణేష్, తదితరులు ఉన్నారు.

వైద్య విద్యార్థిని సన్మానించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

మెడిసిన్‌లో గోనెగండ్ల విద్యార్థిని ప్రతిభ

- అభినందించిన వాల్మీకి సంఘం ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మెడిసిన్ ఫలితాలలో గోనెగండ్ల విద్యార్థినిమేకల అంజలి ప్రతిభ కనభరిచింది. మండల కేంద్రమైన గోనెగండ్ల గ్రామానికి చెందిన మేకల రామాంజనేయులు ఎమ్మిగనూరు ఎస్ఎస్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. ఆయన కుమార్తె మేకల అంజలి ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి తిరుపతి స్విమ్స్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్‌లో సీటు పొందింది. వాల్మీకి సామాజిక వర్గంలో నుంచి కష్టపడి చదివి ప్రతిభతో ఎంబిబిఎస్‌లో సీటు సాధించడంపై ఆదివారం వాల్మీకి ఉపాధ్యా య సంఘం నాయకులు గోనెగండ్లలోని వారి నివాసంలో మేకల అంజలిని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు నాగరాజు తిమ్మన్న శేఖర్ రహమతుల్లా పాల్గొన్నారు.

కరప్రతాలు విడుదల

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 29న భగవాన్ శ్రీజీహ్వేశ్వర జయంతి మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆదోని సమాజ్ ఆధ్వర్యంలో ఆదోని ఫారెస్టు లైన్‌లోని శ్రీఅంబా భవాని దేవాలయంలో విడుదల చేశారు. సమాజ్ ప్రధాన కార్యదర్శి జిందే లక్ష్మణ్ మాట్లాడుతూ భగవాన్ శ్రీజివ్వేశ్వర్ జయంతి నాడు నిర్వహించు ఊరేగింపులో సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు మహిళలు, యువతీ, యువకులు, పిల్లలు, పెద్దలు, వ్యాపార వ్యక్తులు, మాజీ కమిటీ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అధ్యక్షులు గణేష్, నాగరాజ్, ట్రస్ట్ మెంబర్ కృష్ణ, మెంబర్స్ యువ రాజ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మంత్రాలయం చేరుకున్న భక్తులు గ్రామదేవత మంచాలమ్మ రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించు కునేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు శ్రీ మఠం దివాన్ సుధీంద్రాచార్ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకీలో ఉంచి వేద మంత్రాలతో మంగళ వాయిద్యాలు నడుమ శ్రీ మఠం ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా సేవలు చేయించిన భక్తులకు శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు మెమొంటో అందజేసి ఆశీర్వదించారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనం స్వర్ణ మయమై భక్తులకు దర్శనమిచ్చారు.

కుటుంబ సభ్యులకు మరియు జనరల్ పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అయిన లేట్ వాలేకర్ నరసప్ప గారి ధర్మపత్ని శ్రీమతి వాలేకర్ పాపమ్మ ద్వారా కుటుంబ సభ్యులకు మరియు జనరల్ పబ్లిక్ కు తెలియజేయడమేమనగా, కర్నూలు జిల్లా, ఆదోని పట్టణం, గౌలిపేట, ఇంటి నెం. 8/17 కి సంబంధించిన ఇల్లు నా క్లయింట్ కు చెందినది. ప్రస్తుతం అనారోగ్య స్థితిలో వున్నది, వైద్య ఖర్చుల నిమిత్తం మరియు కుటుంబ పోషణ నిమిత్తం చేసుకున్న అప్పు బాపతుకుగాను విక్రయం చేయుటకు నిర్ణయించుకున్నది. నా క్లయింట్ వాలేకర్ పాపమ్మకు పై కనపరచిన ఇల్లు రిజిష్టరు డాక్యుమెంట్ నెం.5692/2006, తేది: 21-12-2006 నాడు నా క్లయింట్ కుమారుడైన వాలేకర్ వీరేష్ దానశెటిల్మెంట్ దస్తావేజు ద్వారా పొందియున్నది. అప్పటి నుండి ఇప్పటి వరకు సదరు ఇల్లు నా క్లయింట్ స్వాధీనానుభవంలో కలదు. సదరు ఇంటి అమ్మకము కుటుంబ సభ్యులకుగాని, జనరల్ పబ్లిక్కు గాని ఏమైన ఆక్షేపణలు వుంటే లేదా కుటుంబ సభ్యులలో ఎవరైన సదరు ఇంటిపై వున్న అప్పు తీర్చి నా క్లయింట్ ఆరోగ్య ఖర్చులు భరించగలిగిన వారెవరైనా వుంటే ఈ నోటీసు ద్వారా కొనడానికి ముందుకు రావచ్చు, లేని యెడల నా క్లయింట్కు సంతృప్తి కలిగినచో బయటి వారికి కూడా విక్రయించుకొనుటకు సర్వహక్కులు కలవు. ఈ నోటీసు ప్రచురితమైన ఒక వారం గడువులోపల ఎవరికైన ఏమైన అభ్యంతరాలు వుంటే నాకుగాని, నా క్లయింటుకుగాని తెలియజేయవచ్చు.

షెడ్యూలు

కర్నూలు డి॥ ఆదోని స॥డి॥ ఆదోని మున్సిపాలిటికి చేరిన ఆదోని పట్టణం, గౌలిపేట వీధిలో వుండు మున్సిపాల్ పాత X-92 కొత్త హోలి VIII - 17 ఇంటికి చెక్కుబంది :
తూ: కామవరం బెనకప్ప గారి VIII- 18 & 19 ఇండ్లు
ప: ఇంటి నెం. VIII - 16 ఇంటి బయలు జాగా
ఉ: రస్తా
ద: కామవరం ముక్కన్న గారి VIII 21 ఇల్లు.

శ్రీ ఎం.వి.లోకేష్ కుమార్,
క్లయింట్ తరపు వకీలు,
ఆదోని.
Cell No.9440503289

రుద్రవరం మండలం పెద్దకంబలూరు గ్రామ సమీపంలోని పంట పొలాల్లో చిరుత సంచరించిన కాలి ముద్ర

నీటి వసతి కరువు

- జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా నీటి పథకాలు
- కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా పనులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీల్లో నీటి కోసం వసతులు కరువయ్యాయి. జగనన్న కాలనీల్లో నీటి పథకాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా పనులు చేయడంతో ప్రారంభానికి ముందే నీటి పథకాలు మూలకు చేరాయి...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్లు – జగనన్న కాలనీల్లో వసతులు కరువయ్యాయి. వసతుల కల్పనకు నిధుల కొరత వెంటాడుతున్న ఫలితంగా కాలనీల్లో మంచినీటి వసతి కల్పించేందుకు చేపట్టిన నీటి పథకాలకు సంబంధించిన పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు నిధులు రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. మరికొన్ని కాలనీల్లో నాసిరకంగా చేపట్టిన పనుల కారణంగా వినియోగంలోకి రాకుండానే దెబ్బతింటున్నాయి. కర్నూలు జిల్లాలోని 81, నంద్యాల జిల్లాలోని 263 జగనన్న లేఅవుట్లలో ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధ్వర్యంలో 473 పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.121.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఒక్కో పనికి కనిష్టంగా రూ.5లక్షల నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు కేటాయించారు. ఈ మొత్తంలో ఇప్పటి వరకు రూ.41.52 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. రూ.30.18 కోట్లకు సంబంధించిన నిధులు ప్రతిపాదన దశలోనే ఆగిపోయాయి. ఇదే సమయంలో స్థలం, రహదారి సమస్యలతో కొన్ని చోట్ల మంచినీటి పథకాలు నిలుపుదల చేశారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పనులు చేశామని, రెండేళ్లు గడిచినా బిల్లులు ఇవ్వకపోతే ఎలాగని ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కొన్ని లేఅవుట్లలో నిబంధనలకు విరుద్ధంగా మంచి నీటి పథకాల నిర్మాణం జరిగినట్లు ఆరోపణలున్నాయి. 30 శాతం ఇళ్ల నిర్మించిన తరువాతే నీటి పథకాల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. పలు కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు మొదలు కాకుండానే నీటి పథకాల పనులు చేపట్టడం, నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి. పత్తికొండ నియోజకవర్గం మద్దికెరలో రూ.17 లక్షలతో, పెరవలిలో రూ.17 లక్షలతో, అగ్రహారంలో రూ.8లక్షల వ్యయంతో పనులు పూర్తిచేసినా గుత్తేదారులు బిల్లులు కోసం ఎదురు చూస్తున్నారు. తుగ్గలి, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో పనులు పూర్తయి రెండేళ్లు గడిచినా నిధులు రాలేదు. ఒకవైపు బిల్లులు రాకపోగా మరో వైపు కుళాయిలు విరిగిపోయాయి. నందికొట్కూరు పట్టణంలో నిర్మించిన ట్యాంకు లీకవుతోంది. నంద్యాల మండలం చాపిరేవులలో ట్యాంకును నాసిరకంగా నిర్మించారు. డోన్, పాణ్యం, నంద్యాల చేపట్టిన పనుల్లో నాణ్యతా లోపంపై ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ఫిర్యాదులు అందాయి. ఇలా జగనన్న కాలనీల్లో చేపట్టిన నీటి పథకాలు ప్రారంభం కాకుండానే మూలకు చేరుకోవడంతో ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

పెద్ద కంబలూరు సమీపంలో

రెండు చిరుతల సంచారం

- భయాందోళనలో రైతులు, ప్రజలు
- సమాచారమిచ్చినా పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు
- అటవీ సమీపంలో సాధారణమే అంటూ సమాధామిస్తున్న వైనం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలంలోని పెద్దకంబలూరు గ్రామ సమీపంలో రెండు చిరుత పులులు సంచరిస్తుండడంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత మూడు రోజుల క్రితం శ్రీరంగాపురం గ్రామ సమీపంలో చిరుత పులి సంచరించినప్పటికీ ఫారెస్ట్ అధికారులు చిరుత పులిని అడవిలోకి తిరిగి పంపించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో మరికొన్ని చిరుతపులులు అటవీ సమీప గ్రామాలైన పెద్ద కంబలూరు సమీపంలోని పంట పొలాల్లో సంచరిస్తూ రైతులను గడగడ లాడిస్తున్నాయి. చిరుత పులుల సంచారం గురించి రైతులు ఫారెస్ట్ అధికారులకు తెలియజేసినప్పటికీ వారు అటవీ సమీపంలో చిరుత పులులు వస్తూ పోతూ ఉంటాయని, అంతమాత్రాన భయపడాల్సిన అవసరం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం తిరుమల అడవుల్లో ఓ బాలికపై చిరుత దాడి చేసి చంపడంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు చిరుతల సంచారం అంటేనే భయాందోళన చెందుతున్నారు. అటవీ సమీపాన వందల ఎకరాల్లో మినుము, మొక్కజొన్న, వరి తదితర పంటలు రైతులు సాగు చేశారు. ప్రస్తుతం తెలుగుగంగ కాలువ ద్వారా నీరు ప్రవహిస్తూ ఉండడంతో రైతులు పంటలకు నీరు పెట్టుకునేందుకు వెళ్ళటానికి భయాందోళన చెందుతున్నారు. పంట పొలాల్లో సంచరిస్తున్న చిరుత పులులు అడవుల్లోకి వెళ్లేలా ఫారెస్ట్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉప'పోరు'లో వైసిపి హవా

- ఉమ్మడి జిల్లాలో రెండు సర్పంచులు, 34 వార్డు స్థానాలకు ఎన్నికలు
- 2 సర్పంచులు, 24 వార్డు సభ్యులు వైసిపి వశం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన గ్రామ పంచాయతి ఉప ఎన్నికల్లో వైసిపి విజయకేతనం ఎగురవేసింది. వివిధ కారణాలతో ఖాళీగా ఏర్పడిన స్థానాలకు నిర్వహించిన ఎన్నికలు ప్రధాన ఎన్నికలను తలపించాయి. కర్నూలు జిల్లాలో ఒక సర్పంచి, 42 వార్డు స్థానాలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో 27 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా ఒక సర్పంచ్, 15 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. కర్నూలు జిల్లాలో ఒక సర్పంచి, 42 వార్డు స్థానాలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో 27 వార్డు స్థానాలు ఏకగ్రీవం కావడంతో శనివారం 15 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అందులో ఒక సర్పంచి, 9 వార్డు స్థానాల్లో వైసిపి బలపరచిన అభ్యర్థులు విజయం సాధించగా 6 స్థానాల్లో టిడిపి బలపరచిన అభ్యర్థులు విజయం సాధించారు. ప్రధానంగా కౌతాళం మండలం బదినేహాలు గ్రామంలో వైసిపి, టిడిపి మధ్య గట్టిపోటీ నెలకొంది. ఇరు పార్టీలు పోటీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ పోటీలో వైసిపి అభ్యర్థి టిడిపి అభ్యర్థిపై 323 ఓట్లతో గెలుపొందారు.

నంద్యాల జిల్లాలో 3 సర్పంచులు, 291 వార్డు స్థానాలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. అందులో అవుకు మండలం అన్నవరం, కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామ సర్పంచ్ స్థానాలతో పాటు ఆయా మండలాల్లోని 272 వార్డుల సభ్యుల స్థానాలు ఏకగ్రీవ మయ్యాయి. దీంతో ఒక సర్పంచి, 19 వార్డు సభ్యుల స్థానాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో ఒక సర్పంచి, 15 వార్డు స్థానాలు వైసిపి బలపరచిన అభ్యర్థులు కైవసం చేసుకోగా టిడిపి బలపరచిన అభ్యర్థులు 3, రెబల్ అభ్యర్థి 1 స్థానం కైవసం చేసున్నారు. ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామ పంచాయతి సర్పంచ్ స్థానానికి వైసిపి నుంచి నల్లజన లక్ష్మిదేవి, టిడిపి తరపున ఆర్ల నాగ శ్రీనివాసులు పోటీ పడ్డారు. వైసిపి అభ్యర్థి ప్రత్యర్థులపై 402 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని, అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిఒ 117 రద్దు అయ్యేంత వరకూ పోరాటం

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ప్రాథమిక పాఠశాలలను కాపాడుకోవడం కోసం జిఒ 117 రద్దు అయ్యేంత వరకు పోరాడుదామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ఉన్న నిశాంత్ భవన్‌లో పివి ప్రసాద్ అధ్యక్షతన యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా రంగానికి 117 జీవో గొడ్డలి పెట్టుగా వుందని, తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయడం ఎక్కడా లేదని, మిగిలిన 1, 2 తరగతుల పాఠశాలలు మనుగడ కొనసాగించ లేవని తెలిపారు. 30 వేల ప్రమోషన్స్ ఇస్తున్నామని ప్రకటించి తీరా స్కూల్ అసిస్టెంట్‌లు, హెడ్మాస్టర్ పోస్ట్‌లు, ఎంఇఒ పోస్ట్‌లు అన్నీ కలిపితే 8551 మాత్రమే ఇచ్చారన్నారు. ఆ సాకుతో 40 వేల ఎస్‌జిటి పోస్ట్‌లు ఊచ కోత కోశారని దుయ్యబట్టారు. ఇంతవరకు ఒక్క డిఎస్సీ కూడా వెయ్య లేదని, విద్యా రంగం ప్రభుత్వ బాధ్యత కాదని తప్పుకుంటున్నట్లుగా సిఎం తీరు వుందని విమర్శించారు. బదిలీలు, ప్రమోషన్స్ జరిగి రెండు నెలలు కూడా కాలేదని, ఇంతలోనే వర్క్ అడ్జస్ట్‌మెంట్ అంటూ భయాందోళనలకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులను ఉప సంహరించుకోకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కౌన్సిల్ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు ఎంవి.సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్, జిల్లా గౌరవాధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, సహాధ్యక్షుడు సత్య ప్రకాష్, ఆర్థిక కార్యదర్శి బాబా ఫకృద్దీన్, జిల్లా ఆఫీస్ బేరర్‌లు రామ్ మోహన్, రామ కృష్ణుడు, కిషోర్, బాలస్వామి, షమీమ్ భాను, సంధ్యా జ్యోతి, నర సింహారెడ్డి, హుస్సేన్, సోషల్ మీడియా కన్వీనర్ అరవింద్, వేంకటేశ్వర రెడ్డి, రామకృష్ణ రెడ్డి, వెంకటయ్య, జాన్సన్, నబి రసూల్, రమణ, ప్రేమకాంత్, మధు, రవూఫ్, శేఖర్, ఖాసీం, రహీమ్, శ్రీధర్ రావు, వేంకటేశ్వర్లు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జిఒ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ల్యాబ్‌లలో అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేయండి

- మెడికల్ కళాశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో నూతనంగా నిర్మితమైన మెడికల్ కాలేజీలో విద్యను అభ్యసించే మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కోర్స్‌కు అవసరమయ్యే అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఎపిఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ ఆవరణంలో నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీ భవనాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో సెప్టెంబర్ 1 నుండి మొదటి సంవత్సరం విద్యనభ్యసించే ఎంబిబిఎస్ విద్యార్థులకు అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ ల్యాబ్ లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థుల అడ్మిషన్స్ పూర్తయ్యాయని, వచ్చే నెల ఒకటో తేదీ నుండి క్లాసులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మెడికల్ కళాశాలలో అరకొరగా మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన ఈనెల 31వ తేదీలోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ ల్యాబ్‌లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు.

మెడికల్ కాలేజీలో వసతులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

మృతి చెందిన కౌలు రైతు నాగేష్

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని కునుకుంట్ల గ్రామానికి చెందిన కౌలు రైతు ఎల్లమ్మ గారి నాగేష్ (25) అప్పుల బాధ తాళలేక శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని కొందరు రైతుల దగ్గర 8 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని పంటలు పండిస్తూ జీవించేవాడన్నారు. గత మూడేళ్లుగా మిర్చి పంటలో సరైన దిగుబడి రాకపోగా అప్పులు అధికం అయ్యాయని తెలిపారు. మృతుడి తండ్రి కూడా అప్పుల బాధతోనే ఏడు నెలల క్రితం గుండెపోటుతో మరణించాడని తెలిపారు. మృతుడు నాగేష్‌కు 20 రోజుల కిందటనే కొడుకు జన్మించాడని, సుమారు రూ. 11 లక్షలు మేర అప్పు కావడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని నాయీబ్రాహ్మణ వీధి, ఖాజీవాడా క్రికెట్ జట్లకు వైసిపి యువ నాయకులు కాటసానిఓబుల్ రెడ్డి క్రికెట్ కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో 6వ వార్డు మెంబర్ సురేష్, వైసీపీ నాయకులు యునూస్, మాభాష, భాష, అబ్బాస్, మాలి, అర్షద్, వసీమ్, రఫి, గౌస్ పీరా, పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్న వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రజా సమస్యలు రాసేదే ప్రజాశక్తి

- 43వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - పాములపాడు

నిత్యం ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించే విధంగా వార్తలు ప్రచురించేది ప్రజాశక్తి దినపత్రిక అని వైసిపి మండల నాయకులు జి.రామలింగేశ్వర రెడ్డి, టిడిపి మండల నాయకులు బి.వెంకటేశ్వరరావులు అన్నారు. ఆదివారం పాములపాడు మండల కేంద్రంలో నందికొట్కూరు డివిజన్ ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధంను వైసిపి మండల నాయకులు రామలింగేశ్వర రెడ్డి, టిడిపి మండల నాయకులు వెంకటేశ్వరరావు, ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జి సి.హనుమంతు, టిడిపి మండల నాయకులు గోవిందు, మధు కృష్ణ, చెలిమిల్ల సర్పంచి చంద్రారెడ్డి, వైసిపి మండల నాయకులు జూటూరు మధు, సిపిఎం మండల కార్యదర్శి సామన్న, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు రాజశేఖర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక కార్మిక, కర్షక పక్షాన నిరంతరం వారి సమస్యల పరిష్కార దిశగా దిక్సూచిగా పని చేస్తుందని తెలిపారు. నిజాలు నిర్భయంగా రాసి ప్రజల మన్ననలు పొందుతున్న ఏకైక పత్రిక ప్రజాశక్తి అన్నారు. అందరి ఆదరాభిమానాలను పొందుతూ, దినదినాభివృద్ధి చెందుతూ 43వ వార్షికోత్సవం జరుపుకుంటున్న ప్రజాశక్తి సిబ్బంది అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు చంద్రయ్య, డివి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధంను ఆవిష్కరిస్తున్న వైసిపి, టిడిపి నాయకులు, ప్రజాశక్తి సిబ్బంది, విలేకరులు

పందుల నుంచి కాపాడుకునేందుకు మొక్కజొన్న పంట పొలం చుట్టూ చీరలను కడుతున్న రైతులు

చీరలతో మొక్కజొన్న పంటకు రక్షణ

ప్రజాశక్తి - చాగలమర్రి

మొక్కజొన్న పంటలను పందుల బెడద నుంచి కాపాడుకోవడానికి రైతులు కొత్తకొత్త ప్రయోగాలు చేస్తున్నారు. పంట చుట్టూ చీరలను కట్టడం, గట్టు దగ్గర సీసాలకు కర్రలకు కట్టి ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికే అడవి పందులు మొక్కజొన్న పంటను నాశనం చేసి రూ. లక్షలు నష్టం కలిగించడంతో రైతులు తమకు తోచిన ఆలోచనను అమలులో పెడుతున్నారు. చీర రూ.25 ప్రకారం 400 చీరలను కొనుగోలు చేసి పంట పొలాల చుట్టూ ఏర్పాటు చేసుకున్నామని కౌలు రైతులు ఓబులేసు, చాంద్‌బాషా, రామకృష్ణ తెలిపారు. మరి కొందరు రైతులు గట్ల దగ్గర సీసాలను కర్రలకు కట్టి ఉంచారు. గాలి వచ్చిన సమయంలో సీసాలు తగులుకొని ఆ శబ్దానికి వన్యప్రాణులు పొలాల వైపు రాకుండా ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు.

అభివృద్ధి పనులను ఇఒ పరిశీలన

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం దేవస్థానం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవస్థానం కార్యనిర్వహణాదికారి లవన్న ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. పరిశీలనలో భాగంగా పంచ మఠాలలో జరుగుతున్న అభివద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ పంచ మఠాలలో జరుగుతున్న పనులలో గర్భాలయం మండపాలు, ల్యాండ్ స్కేటింగ్ పనులు, పంచ మఠాలను కలుపుతూ రోడ్డు మార్గాన్ని త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పనులలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. అనంతరం గణేష్ సదన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇఒ లవన్న

జాయింట్ కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

రెడ్‌క్రాస్ అభివృద్ధికి సహకరిస్తా : జెసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో రెడ్‌క్రాస్ అభివృద్ధికి తనవంతు సహకరిస్తాన,ని ప్రతి విద్యాసంస్థలో రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాకు నూతన జాయింట్ కలెక్టర్‌గా వచ్చిన రాహుల్ కుమార్ రెడ్డిని ఆదివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రతినిధి బృందం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెసి రెడ్‌క్రాస్ కార్యక్రమాల గురించి జిల్లా అధ్యక్షులు దస్తగిరి పర్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రెడ్ క్రాస్ సంస్థ అభివృద్ధికి సహకరిస్తానని,ప్రతి విద్యా సంస్థలో జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్బులను, ప్రతి కళాశాలలో యూత్ రెడ్ క్రాస్ క్లబ్బులను ఏర్పాటు చేసి రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయడంతో పాటుగా, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రెడ్‌క్రాస్ బృందానికి సూచనలు చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష, తెలకపల్లి చైతన్య, డిఎఫ్ఓ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రాభివృద్ధి పదేళ్లు వెనక్కి

- టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్

ప్రజాశక్తి - ప్యాపిలి

వైసిపి పాలనలో రాష్ట్రాభివృద్ధి పదేళ్లు వెనక్కి వెళ్లిపోయిందని టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్ పేర్కొన్నారు. ప్యాపిలి పట్టణంలో టిడిపి బలపరిచిన అభ్యర్థి పార్టీ సీనియర్ నాయకులు నాగేంద్ర భార్య హారతి వార్డు మెంబర్‌గా గెలుపొందిన సందర్భంగా టిడిపి కార్యాలయంలో వై.నాగేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్యాపిలి పట్టణ, మండల, నియోజకవర్గ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు మెంబర్లకు జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులు కొన్నిచోట్ల ఏకగ్రీవం కావడం, కొన్నిచోట్ల గట్టి పోటీని ఇచ్చి గెలుపునకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వైసిపి పతనానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పన్నులు, విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు, నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు అస్తవ్యస్తులు పడుతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికలలో వైసిపిని ఓడించి తెలుగుదేశం పార్టీని కచ్చితంగా గెలిపించగలమని ప్రజలు దీమా వ్యక్తం చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో ప్రజలలో మార్పును తెచ్చిందన్నారు. కార్యక్రమంలో అంకిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రాంమోహన్, సుంకయ్య, ధనం మధు, పెద్ద రామాంజినేయులు, కొంగనపల్లి మధు, చల్లా వీర, మల్లి, రామిరెడ్డి, శీను, నరేంద్ర పాల్గొన్నారు.

నాగేంద్రను సన్మానిస్తున్న నాగేశ్వరావు యాదవ్

బస్సు యాత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు

బస్సు యాత్రను జయప్రదం చేయండి : సిపిఐ

ప్రజాశక్తి - ఆత్మకూర్ : రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కొనసాగుతున్న సిపిఐ బస్సు యాత్రలో సెప్టెంబర్ 2న నంద్యాల జిల్లా కేంద్రంలో జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు కోరారు. ఆదివారం ఆత్మకూరులోని సిపిఐ కార్యాలయంలో బస్సుయాత్ర గోడపత్రికలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' నినాదంతో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు సిపిఐ అగ్రనేతలు నిర్వహిస్తున్న ఈ బస్సు యాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపల్లి మండల కార్యదర్శి కే వెంకట శివుడు, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు ఎస్ అత్తా ఉల్లా, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు తాజుద్దీన్, మండల కార్యదర్శి అహ్మద్ హుస్సేన్, మహమూద్ భాష పాల్గొన్నారు.

దోమల పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - బేతంచెర్ల : దోమల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని, లేదంటే అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని డాక్టర్ ప్రియాంక తేజోమా తెలిపారు. బేతంచెర్లలోని గోరిపేట ఆరోగ్య ఉప కేంద్రంలో ఆదివారం యూపీహెచ్‌సి 1, 2, 3వ వార్డులలోని ఏరియాలలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై కాలనీల ప్రజలతో, ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రామాంజనేయులు, రామారావు, ఆశ వర్కర్లు నాగేంద్రమ్మ, నసీమా, రాధమ్మ, రమణమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలలో వైసిపి విజయకేతనం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలే పంచాయితీ ఎన్నికలలో వైసిపి అభ్యర్థుల విజయానికి దోహదం చేశాయని ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్‌పిటిసి పుల్యాల నాగిరెడ్డి అన్నారు. ఆదివారం నందికొట్కూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 11 వార్డు స్థానాలకు గాను 8 వార్డు స్థానాలను వైసిపి కైవసం చేసుకుందన్నారు. నియోజకవర్గంలో జరిగిన వార్డు స్థానాలకు టిడిపి అభ్యర్థులు పోటీ సైతం చేయలేకపోయారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వైసిపికే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి టౌన్ ప్రెసిడెంట్ మన్సూర్, తర్తూరు సర్పంచ్ నాగిరెడ్డి, నందికొట్కూరు మండల జెసిఎస్ కన్వీనర్ ఓంకార్ రెడ్డి, పగిడ్యాల సర్పంచ్ బాస్కర్, అల్లూరు రవికుమార్, పైపాలెం వైస్ సర్పంచ్ రామకృష్ణ, బాస్కర్‌రెడ్డి, వార్డు మెంబర్‌గా గెలుపొందిన తర్తూరు బోయ నాగేంద్ర, పగిడ్యాల గుండేపొగు సాంబ, పైపాలెం బాలసుబ్బన్న, మర్రి రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి

ప్రజలపై దోమల దండయాత్ర..

- చీకటి పడిందంటే ఆరుబయట ఉండలేని పరిస్థితి
- ఇళ్లలోనూ ఫ్యాన్ల కింద ఉండాల్సిందే..
- ఎన్ని కాయిల్స్ వాడినా తగ్గని దోమల ఉధృతి

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోని గ్రామాల్లో ప్రజలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. మండలానికి శ్రీశైలం బ్యాక్ వాటర్ సమీపంలో ఉన్న గ్రామాల్లో నివసించే ప్రజలు దోమలతో పరేషాన్ అవుతున్నారు. చీకటి పడిందంటే ఫ్యాన్ల కిందనే గడపాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్తపల్లి మండలంలోని పాత మాడుగుల, ఎర్రమఠం, ముసలమడుగు, గుమ్మడాపురం గ్రామాలతోపాటు శ్రీశైలం బ్యాక్ వాటర్ సమీపంలో ఉన్న గ్రామాల్లో దోమలు విపరీతంగా ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలపై దోమలు దాడి చేస్తుండడంతో అనారోగ్యం పాలవుతున్నారు. పగలంతా పనులు చేసి రాత్రి సమయంలో ప్రశాంతంగా నిద్రపోతున్న ప్రజలకు దోమల బాధ ఎక్కువైంది. ఒక వైపు అడవులు, మరోవైపు కనుచూపుమేరలో కృష్ణానది నీటి ప్రవాహం మధ్యలో గ్రామాలు ఉండడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. వైద్యాధికారులు మాత్రం దోమల నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించినప్పటికీ విపరీతంగా దోమల బారి నుండి తప్పించుకోలేకపోతున్నారు. గ్రామాల్లో ప్రజలందరూ చీకటి పడితే దోమల రక్షణ కోసం దోమల కడ్డీలు, ఆల్ అవుట్, వేపాకు పొగ వేసుకోవడంతోపాటు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ శ్రీశైలం బ్యాక్ వాటర్ సమీపంలో ఉన్న గ్రామాలకు దోమల బెడద ఎక్కువైంది.

టిడిపిని గెలిపించండి : బిసి ఇందిరా రెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమని బిసి ఇందిరా రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని అబ్దులాపురం గ్రామంలో మహాశక్తి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే ఎన్నికలలో టిడిపిని గెలిపించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భవిష్యత్తు గ్యారెంటీ సూపర్ సిక్స్‌లో భాగంగా మహాశక్తి కార్యక్రమంలో మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు, మిగిలిన అన్ని వర్గాల వారికి మంచి సంక్షేమం అందించే విధంగా చంద్రబాబు ఎల్లవేళలా కృషి చేస్తారన్నారు. మహిళలు ఇబ్బంది పడకూడదని మంచి ఉద్దేశంతో సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు, బస్సు సౌకర్యం ఫ్రీగా అందిస్తూ, వారికి ఆడబిడ్డ నిధి కింద సంవత్సరానికి 18 వేల రూపాయలు అందించనున్నట్లు చెప్పారు. నిరుద్యోగ యువతకి నెలకు 3 వేల రూపాయల చొప్పున ఇస్తారన్నారు. రైతులకు కూడా సంవత్సరానికి 20వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం కింద అన్నదాత పథకం సంక్షేమాన్ని రూపొందించారని తెలిపారు. ఇవన్నీ అర్హులైన ప్రజలకు అందాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోటపాడు శివరామిరెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టో బుక్‌లెట్‌లను అందజేస్తున్న బిసి ఇందిరా రెడ్డి

ఆళ్లగడ్డ అభివృద్ధి మా కుటుంబంతోనే సాధ్యం

- ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

'ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధి కేవలం మా కుటుంబంతోనే సాధ్యం. నేను మాటల మనిషిని కాదు.. చేతల మనిషిని అని మరొకసారి నిరూపించుకున్నా' అని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. కోట కందుకూరులో సర్పంచిగా గెలిచిన లక్ష్మీదేవి, నియోజకవర్గంలో గెలిచిన వార్డు మెంబర్లు, వైసిపి అభిమానులు ఆదివారం ఎమ్మెల్యే గృహానికి చేరుకున్నారు. ఎమ్మెల్యేకు పూలమాల వేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ సర్పంచి ఎన్నికల్లో కోటకందుకూరులో తమ కుటుంబంపై నమ్మకంతో మీతోనే ఉన్నామంటూ సర్పంచిగా వైసిపి బలపరచిన అభ్యర్థిని గెలిపించిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. నియోజక వర్గంలో వైసిపి విజయం ప్రజా విజయమన్నారు. ప్రతి పక్షాలు మాట్లాడుతున్న అవాస్తవాలన్నీ ప్రజలు కూడా విన్నారని, దానికి బదులు కోటకందుకూరు విజయమే సమాధానమని అన్నారు. ఆళ్లగడ్డ అభివృద్ధి కేవలం తమ కుటుంబంతోనే సాధ్యమని, తాను ప్రజలకు మాత్రమే జవాబుదారినని, ప్రతిపక్షాలు మైక్ ముందరపెడితే పూనకం వచ్చినట్టు మాట్లాడడం సరికాదని, ఓటుతో ప్రజలు మరొక్కసారి బుద్ధి చెప్పారన్నారు. ఆళ్ళగడ్డ నియోజక వర్గంలో సర్పంచ్ కాదు కదా, ఒక్క వార్డు మెంబర్‌ను కూడా గెలిపించుకోలేని మీరు తన గురించి మాట్లాడడం మీ చేతకానితనానికి నిదర్శనమన్నారు. కోటకందుకూరు అభివృద్ధికి తాను ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడానికి కేవలం రెండే రెండు నెలలు చాలని చెప్పడం కాదు చేసి చూపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గంధం రాఘవరెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, కోట కందుకూరు గోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో కోట కందుకూరు సర్పంచు, వార్డు సభ్యులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమరి పట్టణం సమీపంలోని కడప జిల్లా దువ్వూరు మండలం ఇడమడక గుండా సాగే 40వ జాతీయ రహదారిపై ఇడమడక చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం సైకిల్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇడమడక గ్రామానికి చెందిన సుబ్బయ్య, కృష్ణవేణి దంపతులు చాగలమర్రి మండల కేంద్రానికి వచ్చి పని ముగించుకొని తిరిగి తమ గ్రామానికి సైకిల్‌పై వెళుతుండగా అటువైపే వెళుతున్న ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి సైకిల్‌ను ఢీ కొంది. దీంతో సుబ్బయ్య, కృష్ణవేణిలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చాగలమరిలోని కేరళ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పొద్దుటూరుకు తరలించారు.

మృతి చెందిన శీలం స్టీఫెన్

తెలుగు గంగలో మృతదేహం

ప్రజాశక్తి - వెలుగోడు

తెలుగు గంగ జలాశయంలో యువకుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాలు.. వెలుగోడు పట్టణంలోని ఇందిరానగర్ ఎస్‌సి కాలనీ నందు శీలం స్టీఫెన్ ఈ నెల 18వ తేదీ రాత్రి 9 గంటల నుండి కనబడడం లేదని మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట ప్రసాద్ తెలిపారు. ఆదివారం తెలుగుగంగ నీటి మధ్యలో ఓ మృతదేహం తేలాడుతున్నట్లు జాలర్లు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకట ప్రసాద్ లీవ్‌లో ఉన్నందున హెడ్ కానిస్టేబుల్ మాధవరావు, కానిస్టేబుల్ సురేష్ బాబు, హెూంగార్డు ఖుషి నాయక్‌లు మత్స్యకారుల సహాయంతో పుట్టిలో వెళ్లి మృతదేహాన్ని బయటికి తీశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన శీలం స్టీఫెన్ తండ్రి తిమోతికి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు మృతదేహం శీలం స్టీఫెన్‌గా నిర్ధారించిన తర్వాత ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వెలుగోడు ఎస్సై వెంకటప్రసాద్ చరవాణిలో ప్రజాశక్తితో మాట్లాడుతూ శీలం స్టీఫెన్ (19) మానసిక ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

79 శాతం ఓటర్ల పరిశీలన పూర్తి

ప్రజాశక్తి - చాగలమర్రి

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా పరిశీలన 79 శాతం పూర్తయ్యిందని నంద్యాల ఆర్డీవో, ఆళ్ళగడ్డ నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తెలియజేశారు. చాగలమర్రి పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో బీఎల్వోలతో సమీక్ష ఆదివారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజక వర్గంలో 2.25 లక్షల ఓటర్లు, 295 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 295 మంది బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 79 శాతం ఓటర్ల జాబితా పూర్తయ్యిందన్నారు. చాగలమర్రి మండలంలో 69 శాతం మాత్రమే పరిశీలన పూర్తయ్యిందని, పరిశీలన వేగవంతం చేయాలని సూచించారు. ఈ నెల 21 నాటికి సర్వే కార్యక్రమం పూర్తవుతుందన్నారు. ఓటర్ల జాబితా పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ తహసీల్దారు హరినాథరావు, చాగలమర్రి తహసీల్దారు సుభద్రమ్మ, డీటీలు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి. సీనియర్ అసిస్టెంటు విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోలీసు స్పందన తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పోలీసు స్పందన కార్యక్రమం అనివార్య కారణాల వల్ల తాత్కలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుండి వ్యయ, ప్రయాసలతో జిల్లా కేంద్రం జిల్లా పోలీసు కార్యాలయానికి రావొద్దని తెలిపారు. జిల్లాలోని మిగతా అన్నీ పోలీసు స్టేషన్‌లలో, సిఐ, డిఎస్‌పి కార్యాలయాలలో పోలీసు స్పందన కార్యాక్రమం జరుగుతుందని, జిల్లా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థకు సామాగ్రి విరాళం

ప్రజాశక్తి - నంద్యాల : రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) స్వచ్ఛంద సేవా సంస్థకు ఐరన్ ర్యాక్, లైబ్రరీ బుక్స్, బట్టలను గొల్ల జయకృష్ణ, లక్ష్మీకాంతరెడ్డి సహాయ సహకారాలతో అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు దండే దస్తగిరి మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌ఆర్‌ఆర్ సంస్థ వ్యవస్థాపకులు సన్నల సాయిరాం రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద సేవ కార్యక్రమాలలో రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ సుధ ప్రసాద్ రెడ్డి, పీడీజి శ్రీరామ్ మూర్తి, కైలాసనాద్ రెడ్డి, మాలపాటి రాజశేఖర్, విజయ శేఖర్ రెడ్డి, లక్క భూషణం, సుధా మోహన్ రెడ్డి, మామిడి మధుసూదన్, కండే హరినాథ్ తదితర రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

ప్రజాశక్తి - అవుకు : అవుకు పట్టణానికి చెందిన గాజుల విజయ్ కుమార్ (29) తండ్రి మందలించాడని గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన విజయ్ కుమార్ గౌండా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. తాగుడుకు బానిసై ప్రతిరోజూ సంపాదించిన డబ్బులు అంతా మద్యానికి ఖర్చు చేస్తుండడంతో తండ్రి మందలించాడు. విజయ్ కుమార్ మనస్థాపం చెంది ఈ నెల 7న ఇంటిలో ఉంచిన గడ్డి మందును తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతనిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

రూ. 800 కోట్లతో త్వరలో సోలార్ విద్యుత్ ప్లాంట్

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలంలోని కొండమీద గ్రామాలైన మారేమడుగుల, ఉప్పలపాడు, జూనుంతల, కొండమ నాయుని పల్లె, ఇస్రా నాయక్ తండా, పిక్కిళ్ళపల్లి తండా, గ్రామాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ త్వరలో ఏర్పాటు చేయనున్నారు. సుమారు 8 వేల ఎకరాలలో సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. దీంతో విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులకు ఈ నెల 23న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా వర్చువల్ విధానంలో భూమి పూజ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18వ తేదీనే భూమి పూజ చేయాల్సి ఉండగా కొన్ని అనివార్య కారణాలవల్ల ఈ నెల 23వ తేదీకి వాయిదా పడింది. దీంతో భూమి పూజ చేసేందుకు పిక్కిళ్లపల్లి తండా వద్ద పైలాన్ పనులను చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విజయవాడకు చెందిన గ్రీన్కో సంస్థ ఈ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను చేపట్టనున్నట్లు సమాచారం. సుమారు 800 కోట్ల రూపాయల వ్యయంతో ఈ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఎర్రమల కొండల్లో ఈ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు.

ఈ కొండపైనే ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్

ఐక్యతతో హక్కులను సాధించుకుందాం : సిఐటియు

ప్రజాశక్తి-డోన్

ఐక్యతతో హక్కులను సాధించుకుందామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, మెప్మా ఆర్పీల సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమాదేవి అన్నారు. ఆదివారం డోన్ తారకరామనగర్‌లో ఆర్పీల పట్టణ కమిటీ జనరల్ బాడీ సమావేశం ఆ సంఘం అధ్యక్షురాలు బి. సుజాత అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ ఆర్పీలు అనేక సంవత్సరాలుగా మెప్మా విభాగంలో పనిచేస్తూ పట్టణ పేదరిక నిర్మూలన కోసం, పేదల సంక్షేమం కోసం, పట్టణాల్లోని పేద మహిళలను సంఘటితం చేసి వారిని బలోపేతం చేయడం ద్వారా జీవనోపాధి పొందేలా, వారు వ్యక్తిగత వ్యాపారాలు స్థాపించుకొనుటకు ప్రభుత్వం నుండి అందే సంక్షేమ, ఆర్థిక ప్రయోజనాలు వారికి చేరడానికి కృషి చేస్తున్నారన్నారు. మహిళా సాధికారతలో ప్రభుత్వానికి కూడా మంచిపేరు తెస్తూ వారు మాత్రం చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. కనీస గుర్తింపు, వేతనాలూ లేని పరిస్థితులలో ఎన్నో సంవత్సరాలు పని చేశారని రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు చేసిన పోరాటాల ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో వివిఎలుగా, పట్టణ ప్రాంతాలలో ఆర్పీలుగా గుర్తింపుతో పాటు వేతనాలను సాధించుకున్నారన్నారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్,ఇఎస్ఐ సౌకర్యాలతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్, బీమా,పెన్షన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం ఆర్పీలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అన్ని విధాలుగా సిఐటియు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం, మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు, ఆర్పీల సంఘం ప్రధాన కార్యదర్శి సునీత, జైనాబి, రమాదేవి, కళ్యాణి, మంగమ్మ, శశికళ, ఈరమ్మ, నూర్జహాన్, మహబూబ్బీ, మణి, అరుణ, సాధిక, చాంద్‌బి,హబి, సుగుణమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు ఎ.నాగరాజు

చదువుతో పాటు క్రీడలలో రాణించాలి

- 13వ వార్డు కౌన్సిలర్ టిఇ దినేష్ గౌడ్

- రాష్ట్ర స్థాయి లగోరి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-డోన్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని వైసిపి నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్,13వ వార్డు కౌన్సిలర్ టిఇ.దినేష్ గౌడ్ అన్నారు. ఆదివారం డోన్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి మొదటి లగోరి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టిఇ.దినేష్ గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా రంగాల్లో రాణించాలన్నారు. క్రీడలలో రాణించిన విద్యార్థులకు భవిష్యత్తులో ఉద్యోగాలకు సర్టిఫికెట్లు ఎంతో ఉపయోగపడతా యన్నారు. విద్యార్థులు ఇప్పుడు రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయిలో క్రీడలలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ క్రీడా పోటీలలో 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు హర్యానాలోని జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి చైర్మన్ సిద్ధార్థ రాజు, ఎపి సెక్రటరీ అనురాధ, ఎపి ట్రెజరర్ నంద్యాల జిల్లా సెక్రెటరీ పి.శివ, ఎపి తెలంగాణ లగోరి అసోసియేషన్ ప్రతినిధులు వెంకటబాదులు, సచిన్, విశాల్, ఊటకొండ గ్రామ సర్పంచి సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు సేమిరెడ్డి, రాష్ట్రస్థాయి క్రీడల నిర్వహణ కార్యదర్శి మస్తాన్ వలి, వ్యాయామ ఉపాధ్యాయులు టి.నాగరాజు , ఎపి ట్రెజరర్ నంద్యాల జిల్లా సెక్రెటరీ, ఎన్.రామకృష్ణుడు, హరిప్రసాద్ ఆచారి, రంగస్వామి, స్వప్న, వివిధ ప్రైవేట్ విద్యా సంస్థలు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి లగోరి పోటీలు ప్రారంభిస్తున్న టిఇ.దినేష్‌గౌడ్

బేతంచర్లలో అన్ని రైళ్లు ఆపాలి : సిపిఐ

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక వ్యాపారంలో అగ్రగామి మండలంగా పేరుగాంచిన బేతంచర్ల రైల్వే స్టేషన్లో అన్ని రైళ్లను ఆపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బేతంచెర్లలోని పాతబస్టాండ్‌లో ఎఐటియుసి, ఎఐఎస్‌ఎఫ్, కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ నుండి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. రైల్వే సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమానికి పట్టణ కార్యదర్శి నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ డోను నియోజకవర్గంలో ఆర్థికశాఖమంత్రి ఉండి కూడా రైలు ఆపలేకపోవడం అంటే సిగ్గు చేటని విమర్శించారు. దేశానికి స్వాతంత్రం రాక ముందు ఆంగ్లేయుల కాలంలో బేతంచెర్లలో రైల్వేస్టేషన్‌ను ప్రారంభించారని, నాటి నుండి నేటి వరకు ఈ ప్రాంతంలో ప్రయాణికులకు, వ్యాపారస్తులకు, ఉద్యోగస్తులు, దినసరి వేతన కూలీలు, విద్యార్థులకు అందరూ ప్రయాణాలు చేసేందుకు అన్ని రకాలుగా ఉపయోగంగా ఉండేదన్నారు. కరోనా కారణం చేత అన్ని రైళ్లను రద్దు చేసి నేటికి రెండు సంవత్సరాలు పూర్తి అయినా కేవలం ఒకటి, రెండు రైలు మాత్రమే పునరుద్ధరించి మిగతా అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు బేతంచెర్ల మీదుగా తిరుగుతున్నప్పటికీ కనీసం ఒక నిమిషం ఆపకుండా అందరిని ఇబ్బందులకు గురి చేయడం ఏంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్థానిక ప్రజా ప్రతినిధులైన ఆర్థిక శాఖ మంత్రి ఢిల్లీలో 15 రోజులు, రాష్ట్రంలో 15 రోజులు ఉన్నప్పటికీ సొంత మండలం బేతంచర్లలో రైలును ఆపలేకపోవడం ఈ ప్రాంత ప్రజలపై ఆయనకు ఏ మాత్రం ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. నంద్యాల ఎంపీకి నకిలీ విత్తనాల వ్యాపారం మీద ఉన్న దృష్టి కనీసం పార్లమెంటు నియోజకవర్గ సమస్యలపై లేవని, కేవలం ధనార్జన ధ్యేయంగా, పాలకులు వ్యాపారులై ప్రజలను బిక్షగాళ్ళుగా మార్చి అన్ని సౌకర్యాలను దూరం చేస్తున్నారని విమర్శించారు. గుంటూరు నుండి బేతంచర్లకు వచ్చే ప్రయాణికులు అర్థరాత్రి 2 గంటల సమయంలో నంద్యాల లేదా డోన్‌లో దిగి ఉదయం వరకు బస్సు లేదా ఆటో, రైలు సౌకర్యం లేక, మరోవైపు దొంగల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు, ఆర్థికశాఖ మంత్రి, నంద్యాల ఎంపీలు తక్షణమే స్పందించి బేతంచెర్లలో అన్ని రైళ్ళను పాత సమయాలకే ఆపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ జిల్లా నాయకత్వంలో పెద్ద ఎత్తున నిరసన నిర్వహించి బేతంచెర్ల మీదుగా వెళ్లే అన్ని రైళ్ళను దిగ్బంధిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి వై భార్గవ్, మండల సహాయ కార్యదర్శి దస్తగిరి తిరుమల, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, జిల్లా నాయకులు సూర్య చంద్రుడు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాజీ మంత్రి భూమా అఖిల ప్రియను ఆశీర్వదిస్తున్న అర్చకులు

రామతీర్థం క్షేత్రాన్ని దర్శించుకున్న మాజీ మంత్రి అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మండలంలోని ఆర్.కృష్ణాపురం సమీపంలో ఉన్న రామతీర్థం క్షేత్రంలో ఉన్న పుట్టాలమ్మను మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న మాజీ మంత్రికి ఈవో సాయి జయచంద్రారెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో వెలిసిన పుట్టాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి పుట్టలో పాలు పోశ్యారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆమెను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా నాగులచవితి వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : నంద్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం నాగుల చవితి పర్వదిన వేడుకలను ప్రజలు, మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉపవాసం ఉంటూ పుట్ట దగ్గరికి వెళ్లి పూజలు నిర్వహించి పాలు పోశారు. కానాల గ్రామంలో వెలిసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి అర్చకులు జగదీష్ బాబు, సతీష్ శర్మల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. **చాగలమర్రి :** మండలంలోని ఆయా గ్రామాలలో నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. **నంద్యాల కలెక్టరేట్ :** నాగుల చవితి పండగ సందర్భంగా సంజీవనగర్ రామాలయంలో వెలసిన సుబ్రమణ్యే శ్వర స్వామికి భక్తులు పాలాభిషేకం చేశారు. **ఆత్మకూర్ :** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రజలు నాగుల చవితి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. **సంజామల :** మండలంలోని అన్ని గ్రామాలలో నాగుల చవితి పండుగను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. **రుద్రవరం :** మండలంలోని ఆయా గ్రామాలలో నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పుట్టలు, శివాలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాలలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సభ ఆదివారం ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ కార్యదర్శి మస్తాన్ ఖాన్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ రంగాన్ని భారతదేశానికి పరిచయం చేసిన మహెూన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

వెల్దుర్తి మండల కేంద్రం సమీపంలోని హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బేతంచెర్ల మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన బోయ వెంకటస్వామి (35) మృతి చెందాడు. ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వెంకటస్వామిని చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.